# గడియారం

VETAPALEM

పి.వి.బి. రామారావు

ఇత్యేతన్నామ సహస్రం కధితంతే ఘటోద్భవ......
సర్వాప మృత్యు శమనం కాల మృత్యు నివారణం......'
సర్వజ్వరార్తి శమనం దీర్ఘాయుష్య ప్రదాయనం....

లలితా సహస్రనామం చదువుకుని ఉత్తర పీఠిక దగ్గర కొచ్చేసరికి స్వరం కించిత్ హెచ్చించి మంచంమీద వున్న ఆయనకి స్పష్టంగా వినపడేలా చదివి సాష్టాంగ ప్రణామంచేసి ప్రసాదం పట్టుకుని బయటకు వచ్చింది రమారాజ్యం.

అంతవరకూ ఆమె గొంతు వింటూనే వున్న కోదండరామయ్యకి కళ్ళు మూతలుపడ్డాయి.

ముందు హాల్లో ట్యూబ్‌లైట్ వేసింది కోడలు. తరువాత వరండాలో దీ వేసింది.

"అమ్మా, యింట్లో ఎక్కడా చీకట్లు దోబూచులాడకుండా ఖుణీగా వెలుతురుంటే లక్ష్మీప్రదమని బామ్మ చెప్పేది కదూ..... చూశావా యిల్లు యిప్పుడు ఎంత కలకలలాడుతోందో."

వరండాలో ఆ ట్యూబ్‌లైటు కొడుకు వేయించాడు. ఆ రోజు సన్యాసిరాజు మొదటినెల జీతంలో మొదటి ఖర్చు..... లైటు వెలుతురుచూసి చంటిపిల్లాడిలా ముచ్చటపడిపోయాడు.

"ఇది నీ కోడలు సలహా!" అన్నాడు తల్లితో. కొత్త కోడలు కొత్తింటి పిల్ల. కొత్త దీపం వంక చూసింది. ట్యూబ్‌లైటు వెలుతుర్లో బుగ్గలు ఎర్రగా గులాబీలా మిలమిలాడాయి.

మసకగా వున్న గదిలోకి రమారాజ్యం వచ్చింది. కోదండరామయ్య కళ్ళు విప్పాడు.

"ఏమండీ అదోలా వున్నారు..... ఒంట్లో....."

"అబ్బే ఏం లేదు.... నీ గొంతు వింటూ మోగన్నుపడింది."

"లేచి కాస్త బయటకు రారాదూ. మీ కుర్చీలో కూచుంటే మీకూ హాయిగా వుంటుంది. లేవండి ప్రసాదం యిదిగో. నోట్లోవేసుకోండి!"

పటికబెల్లం ముక్క కళ్ళకద్దుకొని నోట్లో వేసుకుని చెయ్యి తలకేసి రాసుకున్నాడు కోదండరామయ్య.

"ఏమిటండీ ఆ పరాకు? మళ్ళీ నొప్పి వచ్చిందా? మాత్ర వేసుకున్నారా?"

"అబ్బే, లేదు."

"ఏమిటండీ..... అదోలా వున్నారు? నాతో చెప్పండి! మళ్ళీ నొప్పి రాలేదుకదా?..."

"లేదే. నొప్పేమీలేదు."

"మరి?"

"ఏం లేదని చెప్పాగా" తలగడకి జేరబడ్డాడు కోదండరామయ్య.

"అసుర సంధ్యవేళ దీపం లేకండా......" అంటూ కోడలు లోపలికొచ్చింది.

"హమ్మయ్య!" కోదండరామయ్యకి ప్రాణం లేచివచ్చినట్లనిపించింది దీపం వెలగ్గానే.

"టైమెంతయిందో?"

రమారాజ్యం గోడగడియారం వంక చూసింది. పదకొండున్నరకి ఆగిపోయింది.

"సరోజా..... గడియారం కీ యివ్వడం మరచిపోయాడల్లే వుంది..... నువ్వు....."

"ఆ బల్ల ఎక్కడం నాకు భయం... మామయ్యగారూ. ఇదిగో ఈ గడియారం దగ్గరుంచుకోండి... ఆయన రాగానే కీ యిచ్చి టైము దిద్దిపెడతారు."

"సరేనమ్మా."

కోదండరామయ్య నడుం వాల్చాడు. గడియారం ఆగిపోయింది. ఆగిపోవడంలో ఆశ్చర్యం లేదు... పనిచేసినంతసేపు పనిచేసి ఏ యంత్ర మయినా ఆగిపోవాల్సిందే... దాని టైము ప్రకారం అది జరుగుతుంది కాల ప్రవాహం... ఎంత ఆలోచించినా అంతుతెగని వ్యవహారం... దేని సమయానికి అది జరిగిపోవాల్సిందే. –గురబ్రహ్మ స్వరూపం కాలం.... మనిషితో, మేధస్సుతో, ప్రజ్ఞతో, దరిద్రంతో, సంపదతో నిమిత్తంలేనిది..... అది కాలం."

ఆలోచనలో మళ్ళీ కళ్ళు మూతలుపడుతున్నాయి... కాని బలవంతంగా కళ్ళు విప్పుతూ అడిగాడు "సరోజా.... జయంతి ఎప్పుడు బయలుదేరుతున్నట్టు రాసింది..... రేపు సాయింకాలం కదూ..... లేక ఈ సాయంత్రమేనా?"

"వచ్చే బుధవారం సాయంకాలం మావయ్యగారూ... పిల్లలకి పరీక్ష లైపోగానే బయలుదేరుతానని రాసింది. రిజర్వేషన్లు చేయించేశారట."

"ఏం పరీక్షలో నమ్మా! ఆయన ఆరోగ్యం అల్లావుండి చూడాలని ఆరాటపడుతూంటే దిగ్గున లేచిరావడానికి కుర్రవెధవల క్వార్టర్లీ పరీక్షలు అడ్డువచ్చాయా మన వస్తువుకాని దయిపోయింతర్వాత ఏమనుకొని ఏం లాభం?..." రమారాజ్యం ఉస్సురని నిట్టూర్చింది.

అల్లుడు మంచి కత్తి మెత్తనా వుంటాయా అనుకుంది ఆరాటంలో సామెత సగం మరచి....

"లేవండి... మెల్లగా బయటకు తీసుకు వెళతాం. కుర్చీలో కూచుందురుగాని.... ఆ పిల్లకోసం ఎందు కంత ఆందోళనా? హాయిగా వుందిగా....."

"అబ్బే అందుకు కాదే..." కోదండరామయ్య గడియారం వంకే చూస్తున్నాడు.

ఒక్క క్షణం అక్కడ నిలబడి సరోజ బయటికి వెళ్ళింది.

"మీ మనసులో ఏదో వుంది. బయటికి చెప్పకూడదూ! దేనిగురించో ఆలోచించి తెగబాధపడిపోతున్నారు."

"ఏం లేదే.... బాబిగాడొచ్చే టైమయిందా?" అంటూ కోడలిచ్చిన గడియారం తీసి చూశాడు...

దానివంకే అలా చూస్తూ వుండిపోయారు. ఉస్సురని నిట్టూర్చి మళ్ళీ తలగడకి జేరబడ్డారు.

రమారాజ్యం మళ్ళీ లోపలికి వచ్చేసరికి భర్త కళ్ళుమూసుకుని వున్నాడు.

"ఏం అత్తయ్యగారూ..... మీరు బెంగపెట్టుకోకండి. ఏం పర్వాలేదని డాక్టరు చెప్పాడుగా. ఆయన దగ్గరే కూచుని ఆమాటా ఈమాటా చెప్పండి. మామయ్యగారు బాగా బెంగపెట్టుకుంటున్నారు."

## ప్రాబ్లమ్!

ఒకస్టేజిలో
సంపాదన – బ్రతుకు ఈడ్చడానికి
సరిపోక ప్రాబ్లమ్!
మరో స్టేజ్‌లో
సంపాదించిన ధనాన్ని
ఎలా, ఏరూపంలో దాచాలో
విచిత్ర మైన ప్రాబ్లమ్!

–యస్. యస్. రెడ్డి

"ఏం చెప్పనమ్మా. ఏదో దిగులు. నిన్న బాగానే వున్నారు. ఎంతో నవ్వుతూ తిన్నది ఆ తోటకూర పోపూ – మజ్జిగా అన్నమే అయినా – ఎంతో సరదాగా వున్నారు.

ఈరోజు ఏమయిందో ఏమో. మళ్ళీ నొప్పి వచ్చిందేమో... బాబీ వస్తే ఆయనకు తెలియకుండా డాక్టరు నొకసారి రమ్మని కబురుపంపాలి..."

ఆవిడ దిగులుగా కూచుంది. కొంచెంసేపటి తరువాత పూజగదిలోకి వెళ్ళింది. ఆంజనేయస్వామికి మొక్కుకుని యింత సింధూరం ఆయన నుదుటన పెట్టాలనుకుంది.

SARASWATA NIKETANAM
VETAPALEM

సరోజ అటూ యిటూ తిరిగింది. ఏదోలావుంది తనకీ మనసు. ఆయన రోజూ ఈసరికి యింటికి రావాల్సిందే. ఆఫీసు పనిఎద్దడి ఎక్కువగా వుందో ఏమిటో...

మామగారి గదిలోకి వెళ్ళింది. ఆయన గుండెలమీద తన గడియారం చేతిలోనే పట్టుకుని ఆలోచిస్తున్నారు.

"మామయ్యగారూ!"

"ఆఁ!" తుళ్ళిపడ్డట్టు అడిగారు.

"ఏదో పరాకుగా వున్నారు. అత్తయ్యగారితోనూ ఏం మాటాడటం లేదట! ఆవిడ కంట తడిపెట్టుకుంటున్నారు. మీ కేమిటి లోటు? ఏమిటి బాధ? జయంతి గురించి మీరేమీ బెంగపెట్టుకోకండి. అతను చాలా మంచివాడు. అతనికి తగిన భార్య మా వదిన."

"అంతేనంటావా?" కోదండరామయ్య చేతిలోని గడియారాన్ని పక్క బల్లమీద పెడుతూ అడిగాడు."

"డాక్టరుగారు మరీమరీ చెప్పారట.... కంగారుపడ్డానికి ఏమాత్రం అవసరం లేదని రేపు ఆదివారం సాయింకాలం యిలా షికారుగా వస్తామనీ చెప్పారట..... మీరు సందడిగా వుండడంలేదని అత్తయ్యగారు బెంగ పెట్టేసుకుంటున్నారు."

"వెర్రిదమ్మా! అది పట్టి వెర్రిబాగులది. నాకుమాత్రం సరదానా? చలాకీగా, హాయిగా నవ్వుతూ వుండాలని వుండదూ. కాని కాలం ఎప్పుడూ మనం చెప్పినట్టే వినదుకదా. కాలం చేతుల్లో బొమ్మలం మనం.... దేని సమయానికి అది....."


"ఊరుకోండి మావయ్యగారూ. ఆవిడవింటే బెంబేలుపడిపోతారు. అలా బయటకు రండి. కుర్చీలో కూర్చుందురుగాని. నేను దిండు గలేబులూ అవీ మార్చి మీకు నచ్చిన పుస్తకం చదివి వినిపిస్తా"

అంటూ ఆయనను మెల్లగా బయటకు తీసుకువస్తూ బల్లమీద గడియారం వంక చూసింది – అదీ ఆరు గంటలకి ఆగిపోయివుంది.

"ఏం చదవమంటారూ?" అంటూ రమారాజ్యం వరండాలోకి వచ్చింది.

"సరోజ చదువుతా నంటోంది... అమ్మా సరోజా... పక్క దులుపుతున్నట్టుంది... రా యిలా కూర్చో.... వంటయిందా?..."

"ఏం వంటో ఏమిటో నా కేం పాలుపోవడంలేదు. మీరు తినకుండా......"



గది లోపలనుంచి దభేలున శబ్దం.

"ఏమిటే అది?" రమారాజ్యం లోపలికెళ్ళింది.

"అరెరె! పడిపోయావా?..."

"దిగుతూవుంటే బల్ల తూగిందత్తయ్యా."

కోదండరామయ్య మెల్లగా లోపలకొచ్చాడు.

'దెబ్బతగిలిందా తల్లీ... నీ గడియారం యిప్పుడ్గా... నాకు టైంతో ఏం పని చెప్పు?..."

"నాకు దెబ్బేం తగల్లేదు మామయ్యగారూ. మీ మనసులో ఆరాటానికి కారణం నాకు తెలిసిపోయింది. అందుకే....."

బల్లమీద కోడలు చేతిగడియారాన్ని చూశాడు... అదీ దిద్దేవుంది.

"నువ్వు తెలివైన దానివమ్మా... అందుకే నా కొడుకు నిన్ను ప్రేమించి మరీ చేసుకున్నాడు. అది వాడి అదృష్టమే కాదమ్మా.... అది మా కుటుంబాని కంతటికీ అదృష్టం...."

–కోదండరామయ్యలో అంత ఉత్సాహం ఎందుకొచ్చిందో, కోడల్ని ఎందుకలా పొగొడుతున్నాడో రమారాజ్యానికి మాత్రం బోధపడలేదు. కోడలివంక అయోమయంగా చూసినా భర్త ముఖంలోని వెలుగుని చూస్తూమాత్రం ఆమె ముఖం గత మూడు నెలల్లోనూ ఎన్నడూ లేనంతగా వికసించింది. □